క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా శనివారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని ఈ కింది ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రావు తెలిపారు.

- ఉదయం 6 నుంచి 8 గంటల వరకు.. ఎస్‌బీహెచ్ కాలనీ, భవానీనగర్, హనుమాన్ టెంపుల్, మనోరమ ఐటీఐ, విద్యుత్ నగర్, కుమారస్వామి టెంపుల్, పంచఫార్మా ఎస్ఐ, అడ్డగుట్ట, వాంబే కాలనీ, భవానీమాత టెంపుల్, పోచమ్మ టెంపుల్, ద్వారకా నివాస్ పరిసర ప్రాంతాలు.
- ఉదయం 8 నుంచి 10 గంటల వరకు.. ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ, న్యూహనుమాన్ టెంపుల్, భవానీనగర్, ద్వారకాపురి, ప్రతాప్‌నగర్, భాష్యం స్కూల్ పరిసర ప్రాంతాలు.
- ఉదయం 10 నుంచి 12 గంటల వరకు... రైల్వేట్రాక్, నం.2 గల్లీ, ఫతేష్ సిద్దీఖ్ మసీద్, నిజాం హోటల్, గౌసియా స్కూల్, ఖాస్‌నగర్ నాలా పరిసర ప్రాంతాలు.

నేడు భవానీనగర్‌లో ఉచిత వైద్యశిబిరం

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ భవానినగర్ కాలనీలోని భవానీ మహిళా మండలిలో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మహిళా మండలి అధ్యక్షురాలు శేషకుమారి తెలిపారు. మహిళామండలి, రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఋషి ప్రభాకర్ విద్యాకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మలక్‌పేట యశోద ఆసుపత్రి సహకారంతో వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. వైద్యులు బీపీ, మధుమేహం, ఈసీజీ, 2డి ఎకోతో పాటు డెంటల్, కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరిసర కాలనీల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శేషకుమారి కోరారు.

నేడు వక్తృత్వ పోటీలు

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్‌లోని మాస్టర్ మైండ్స్‌లో శనివారం 9,10వ తరగతి విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్న బ్రాంచ్ జోనల్ అడ్మిన్ ఎస్. వెంకటేశ్వర్‌రావు తెలిపారు. 'ఒక చార్టర్డ్ అకౌంటెంట్ సంతకం ప్రధాని సంతకం కంటే విలువైనది' అని దేశ ప్రధాని నరేంద్రమోదీ అన్న అంశంపై వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు. ఉదయం 10 గంట నుంచి పోటీలు ప్రారంభమవుతాయని, ప్రతీ విద్యార్థికి 5 నిమిషాలు సమయం ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 92467 47481ను సంప్రదించవచ్చు.

బాధ్యతలు తీసుకున్న చైతన్యపురి కొత్త ఇన్‌స్పెక్టర్


నాగార్జున

చైతన్యపురి: చైతన్యపురి పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బి.నాగార్జున పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన మధుసూదన్ డీఎస్పీగా పదోన్నతి పొందారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన నాగార్జున 2009 సబ్‌ఇన్‌స్పెక్టర్ బ్యాచ్‌కు చెందినవారు. గతంలో మేడ్చల్, వనస్థలిపురంల్లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. 2019లో ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోషన్ వచ్చింది. హయత్‌నగర్ డీఐగా, ఎల్‌బీనగర్ ట్రాఫిక్, సీసీఎస్, రాచకొండ పీడీ యాక్ట్ సెల్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. స్టేషన్ పరిధిలో ప్రజల సహకారంతో శాంతిభద్రతలు కాపాడతామని, నేరాల అదుపునకు కృషి చేస్తామన్నారు.

శాకంబరి అలంకరణలో దుర్గా రాజరాజేశ్వరికి పూజలు


పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్ తదితరులు

మలక్‌పేట: మూసారంబాగ్ దుర్గా రాజరాజేశ్వరి త్రిశక్తి ఆలయంలో ఆషాడ బహుళ పంచమి సందర్భంగా శుక్రవారం శాకంబరి ఉత్సవాలు నిర్వహించారు. వివిధ రకరకాల కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించారు. కమిటీ చైర్మన్ జూకంటి జూకంటి యాదగిరి, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 65, వంకాయ 28, బెండ 40, పచ్చిమిర్చి 85, కాకర 55, బీర 35, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 16, కారెట్ 50, దొండ 35, ఆలు 21, ఉల్లి 24, గోకర 35, దోస 23, సొర 13, పొట్ల 18, అరటి 11, చిక్కుడు 65, అర్వి 40, మునగ 48, చిలగడదుంప 40, బీట్‌రూట్ 23, కీర 28, ఫ్రెంచ్ బీన్స్ 95, కాప్సికమ్ 67. శనివారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

పెద్ద చెరువును అద్భుతంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే


గ్రీన్‌లీవ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులతో కలిసి పెద్ద చెరువును సందర్శిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: మన్సూరాబాద్‌లోని పెద్ద చెరువును అద్భుతంగా తీర్చిదిద్దుతామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గ్రీన్ లీవ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులతో కలిసి ఆయన శుక్రవారం పెద్ద చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పెద్ద చెరువును గ్రీన్ లీవ్స్ సంస్థ దత్తత తీసుకునేందుకు ముందుకు రావడం సంతోషదాయకమని, ఆ సంస్థ నిర్వాహకులను అభినందించారు. చెరువును సుందరంగా తీర్చిదిద్దటంతో పాటు పిల్లలు ఆడుకోవడానికి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సందర్శకులు కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే చెరువు పక్కనే ఉన్న అమ్మదయ కాలనీలోని పార్కును అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, నాయకులు జగదీష్‌యాదవ్, అనిల్ చౌదరి, గ్రీన్‌లీవ్ సంస్థ సభ్యులు శ్రీశ్రీరెడ్డి, రఘు కాలనీవాసులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం: సామ


వెంకటరమణ కాలనీలో పాదయాత్ర చేస్తున్న రంగారెడ్డి

వనస్థలిపురం: బీఆర్ఎస్ పార్టీ అనేక సంక్షేమ కార్యక్రమాలను మానిఫెస్టోలో పెట్టి ప్రజలను ఆశల పల్లకిలో ఊరేగిస్తూ 9 ఏళ్లుగా కాలయాపన చేస్తోందని బీజేపీ రంగారెడ్డి జిల్లా (అర్బన్) అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన వనస్థలిపురం డివిజన్ పరిధిలోని వెంకటరమణ కాలనీ, న్యూ వెంకటరమణ కాలనీ, రాజిరెడ్డినగర్ కాలనీలో పాదయాత్ర చేస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల అతీగతీ లేదన్నారు. కేజీ టు పీజీ అడ్రెస్సు లేదని, నిరుద్యోగ భృతి ఊసే లేదన్నారు. తెలంగాణాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు రావాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, బీజేపీ ఎల్‌బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్, నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, తడకమళ్ల విజయ్ కుమార్, గోగిరెడ్డి శ్రీనివాస్, డి.శ్రీనివాస్‌రెడ్డి, అంజన్‌కుమార్‌గౌడ్, చెక్క అశోక్ కుమార్ గౌడ్, రేవతి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి: రాంరెడ్డి


రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో పార్కు స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని, జీఓ నంబర్ 58, 59లను అడ్డుపెట్టుకుని కొంతమంది భూకబ్జాదారులు ప్రభుత్వ భూములను స్వాహా చేస్తున్నారని ఎల్‌బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. పార్కు స్థలాలను, ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ శుక్రవారం ఆయన రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. హయత్‌నగర్‌లో ధోబీఘాట్ కోసం ఇచ్చిన రెండు ఎకరాల స్థలంలో ఒక ఎకరాన్ని ఇప్పటికే కబ్జా చేశారని, మిగిలిన మరో ఎకరాన్ని కూడా కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని వినతి పత్రంలో రాంరెడ్డి పేర్కొన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే బంజారా కాలనీలో కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిన స్థలాన్ని కబ్జా చేయటానికి యత్నిస్తున్నారన్నారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని మారుతీనగర్‌లో గుడి స్థలం కూడా కబ్జాకు గురైందని, ఇలా ఎల్‌బీనగర్‌లోని పలు ప్రాంతాల్లో భూములు కబ్జాకు గురవుతున్నాయన్నారు.

ఆలయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించండి


జెడ్సీ పంకజకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ కార్పొరేటర్లు

మన్సూరాబాద్: రాబోయే బోనాల ఉత్సవాలను దృష్టిలో పెట్టుకుని ఎల్‌బీ నగర్‌లోని అమ్మవారి ఆలయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని జీహెచ్ఎంసీలో బీజేపీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజను కలిసి ఆలయాల వద్ద మౌలిక సదుపాయాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చింతల అరుణాసురేందర్ యాదవ్, మొద్దు లచ్చిరెడ్డి, బద్దం ప్రేమ్ మహేశ్వరరెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

చనిపోయిన ఓటర్ల వివరాలు ఇస్తే తొలగిస్తాం

ఎల్‌బీనగర్ సర్కిల్ ఈఆర్ఓ మారుతీదివాకర్


గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో సమావేశమైన ఈఆర్ఓ మారుతీదివాకర్

ఎల్‌బీనగర్: రాజకీయ పార్టీల నాయకులు చనిపోయిన ఓటర్లను గుర్తించి, ఆ వివరాలను తమకు అందజేస్తే విచారణ జరిపి తొలగిస్తామని ఎల్‌బీనగర్ సర్కిల్ ఈఆర్ఓ, డీసీ మారుతీదివాకర్ అన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ మారుతీదివాకర్ మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో 5,34,638 మంది ఓటర్లుగా ఉన్నారన్నారు. ప్రతి బూత్‌కు ఒక బూత్‌లెవల్ అధికారితో పాటు పార్టీ నుంచి బూత్ లెవల్ ఏజెంట్‌ను కూడా నియమించాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులను ఇప్పటికే నియమించామన్నారు. ఓటర్ల తొలగింపుపై అన్ని రాజకీయ పార్టీల నేతలు ఓ నిర్ణయానికి వచ్చిన తర్వాతే తొలగింపు ప్రక్రియ చేపడతామన్నారు. ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. 8 పోలింగ్ బూత్‌లు కూల్చివేశారని, వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో సర్కిల్-5 డీసీ కృష్ణయ్య, నాయకులు నారాయణ రెడ్డి, మురళీధర్‌రెడ్డి,కుమార్, కొత్త రవీందర్‌గౌడ్, విజయ్‌కుమార్, గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు.

డబ్బులు చెల్లించకపోతే స్థలాలు స్వాధీనం చేసుకుంటాం

ఉప్పల్ తహసీల్దార్ గౌతమ్ కుమార్


జీఓ 59 కింద డబ్బులు చెల్లించపోవడంతో ఇంటిని కూల్చివేయిస్తున్న అధికారులు

నాగోలు: ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఇళ్లు నిర్మించుకొని, జీఓ 59 కింద వాటి క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకొన్న వారు ప్రభుత్వానికి నిర్ణీత ఫీజు (డబ్బులు) చెల్లించకపోతే ఆ ఇళ్లను కూల్చివేసి స్థలాలను స్వాధీనం చేసుకుంటామని ఉప్పల్ తహసీల్దార్ కె. గౌతమ్ కుమార్ స్పష్టం చేశారు. నోటీసులు ఇచ్చినా ఫీజు చెల్లించకపోవడంతో ఫతుల్లగూడ, బండ్లగూడ గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేతను రెవెన్యూ అధికారులు శుక్రవారం చేపట్టారు. కూల్చివేతలను పర్యవేక్షించిన తహసీల్దార్ మాట్లాడుతూ, ప్రభుత్వ భూముల్లో 2020 జూన్ 2 కంటే ముందు నిర్మించుకున్న అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం జీఓ 59 కింద అవకాశం ఇవ్వడంతో మండల పరిధిలో 847 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ దరఖాస్తులను విచారించి వారి ఇంటి విస్తీర్ణాన్ని బట్టి ప్రభుత్వం డిమాండ్ నోటీసులు జారీ చేసిందన్నారు. అయితే ఇందులో 123 మంది లబ్ధిదారులు నేటి వరకు డబ్బులు చెల్లించారని వారికి వెంట వెంటనే రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నామన్నారు. మిగతా వారిని డబ్బులు (ఫీజు) చెల్లించాలని ఆరు నెలలుగా కోరుతున్నా పట్టించుకోలేదని, గడువు ముగిసినా డబ్బులు చెల్లించట్లేదన్నారు. జీఓ 59 కింద నాగోల్, బండ్లగూడ, ఫతుల్లగూడ, కొత్తపేట గ్రామాల్లో మొత్తం 277 మంది దరఖాస్తు చేసుకున్నారని, అందులో 70 మంది మాత్రమే డబ్బులు చెల్లించారన్నారు. మిగతా వారు చెల్లించపోవడంతో కూల్చివేతలు మొదలుపెట్టామన్నారు. ఇకనైనా మిగతా లబ్ధిదారులు మేలుకొని జీఓ 59 కింద ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకొని నిర్ణీత ఫీజు చెల్లించి ఇళ్ల రెగ్యులరైజ్ చేసుకోవాలని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ సూచించారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

మలక్‌పేట: మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి శుక్రవారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. సలీంనగర్‌లోని సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా సఫైర్ ఫంక్షన్ హాల్ లేన్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ రవికాంత్, సైట్ ఇంజినీర్ ఏడుకొండలు, కాలనీవాసులు శ్రీకాంత్, సంతోష్, ప్రభు తదితరులు ఉన్నారు.

'దండోరా ఉద్యమం మాదిగల ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది'


రాజీవ్‌గాంధీనగర్‌లో ఎమ్మార్పీఎస్ టీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న మేడి పాపయ్యమాదిగ

నాగోలు: దండోరా ఉద్యమం మాదిగల ఆత్మగౌరవాన్ని, హక్కులను నిలబెట్టిందని ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ అన్నారు. కొత్తపేట డివిజన్ రాజీవ్ గాంధీ నగర్‌లో శుక్రవారం మాదిగ దండోరా 29వ ఆవిర్భవ దినోత్సవాన్ని ఎల్‌బీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు ద్యావని నరసింహ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన మేడి పాపయ్య ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో జాతీయ మహిళా అధ్యక్షురాలు ఆకారపు రుక్కమ్మ, జాతీయ కార్యదర్శి జీడి నర్సింహ, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ మలక్‌పేటలో...

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేటలోని అంబేడ్కర్ లైబ్రరీ చౌరస్తాలో మలక్‌పేట ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బాబు రాజు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. నాయకులు ఉప్పలయ్య మాదిగ, బాబు శ్రీనివాస్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, జగదంబ, సంపత్ నాగరాజు, రాజేందర్ పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించాలి

దిల్‌సుఖ్‌నగర్: భారత దేశంలో ఉన్న చట్టాలు మహిళలకు పూర్తి న్యాయం చేయలేక పోతున్నాయని సుప్రీం కోర్టు న్యాయవాది, 18వ లా కమిషన్ సభ్యురాలు కీర్తిసింగ్ అన్నారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని మహాత్మాగాంధీ న్యాయ కళాశాలలో అఖిల భారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కీర్తిసింగ్ మాట్లాడుతూ, మహిళలకు విడాకుల కేసుల్లో సరైన న్యాయం దొరకడం లేదన్నారు. కొన్ని చట్టాలు మహిళలకు రక్షణ కల్పిస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో అమలు జరగడం లేదన్నారు. ఉద్యోగం చేసే చోట మహిళలు ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఉమ్మడి పౌరసత్వంపై ఇంకా లోతైన చర్చ జరగాలని కీర్తిసింగ్ అభిప్రాయపడ్డారు. మహిళలకు చట్టాలపై న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, సెక్రటరీ గంగుల గోవర్ధన్‌రెడ్డి, అధ్యాపకులు, అఖిల భారత న్యాయ వాదుల సంఘం సభ్యులు ఆజాద్, పార్థసారథి, రామారెడ్డి, శ్రీరెడ్డి, వనజ పాల్గొన్నారు.

ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు.శుక్రవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థకాలనీ ఫేజ్-1 లో కాలనీవాసులతో కలిసి ఆమె పర్యటించారు.ఈ సందర్భంగా సుజాతనాయక్ మాట్లాడుతూ, ఇంద్రప్రస్థకాలనీలో మిగిలిపోయిన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి, సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కాలనీలో అర్ధంతరంగా నిలిచిన థీమ్ పార్క్ పనుల తిరిగి ప్రారంభమయ్యేందుకు కృషి చేస్తానన్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెదిరే యోగీశ్వర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు ఎస్.రామ్‌రెడ్డి, నాగయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డిఫెన్స్ కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో డిఫెన్స్ కాలనీ సంఘం ప్రతినిధులు

చంపాపేట: డివిజన్ పరిధిలోని డిఫెన్స్ కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. శుక్రవారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు నల్లా రఘుమారెడ్డి ఆధ్వర్యంలో డిఫెన్స్ కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి కాలనీలో సంక్షేమ సంఘ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు భూగర్భ డ్రైనేజీ విస్తరణ వంటి సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి, సంక్షేమ సంఘ ప్రతినిధులు ప్రభాకరరావు, జైపాల్‌రెడ్డి, మేక సురేందర్ రెడ్డి, రాము, బాలరాజు, రవీందర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా


చెక్కులు అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని తెలంగాణ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని మన్సూరాబాద్ బాలాజీ నగర్‌కు చెందిన పద్మ, ఆమె కుమార్తె ఝాన్సీలకు డెంగీ వ్యాధి సోకడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. పేదలైన వారు వైద్యఖర్చుల కోసం ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం ఇప్పించాలని ఉప్పల శ్రీనివాస్‌గుప్తాను కలవగా.. ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. ఇద్దరికీ సీఎం సహాయ నిధి నుంచి రూ. 95 వేలు విలువైన చెక్కులు మంజూరు కాగా, వాటిని శ్రీనివాస్‌గుప్తా శుక్రవారం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ, సీఎం సహాయ నిధి వల్ల ఎంతో మంది పేదలకు ఆర్థిక సాయం అందుతోందని చెప్పారు. వైద్యం చేయించుకొనే ఆర్థిక స్తోమత లేని ప్రజలంతా సీఎం రిలీఫ్ ఫండ్‌ను వినియోగించుకోవాలన్నారు.

ధ్యానాంజనేయ స్వామి సేవలో సంగీత దర్శకుడు మణిశర్మ


మణిశర్మను ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకులు

చంపాపేట: ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మణిశర్మ, ఆయన కుమారుడు స్వరసాగర్ మహతి శుక్రవారం కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో మధుసాగర్, ఆలయ ఈఓ శ్రీనివాసశర్మ, అర్చకులు ప్రవీణ్‌శర్మ, అంబ ప్రసాద్‌శర్మ, సంతోష్ శర్మ, పీబీ శుక్ల, శంకర్‌శర్మ పాల్గొన్నారు.

సైదాబాద్‌లో ఇంటర్ విద్యార్థిని కిడ్నాప్

సైదాబాద్: ఇంటర్ విద్యార్థిని కిడ్నాప్ అయిన ఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలానికి చెందిన బాలిక (16) చంపాపేటలోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ అదే కళాశాల హాస్టల్‌లో ఉంటోంది. గత నెల 29న బాలిక కాలేజీ నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. కాలేజీ సిబ్బంది ఈ సమాచారాన్ని ఊరిలో ఉన్న బాలిక తండ్రికి తెలియజేశారు. అయితే గతంలోనూ బాలిక కొన్నిసార్లు ఎవరికీ చెప్పకుండా బంధువుల ఇంటికి వెళ్లి రెండు రోజులకు వచ్చింది. ఈసారి కూడా అలానే వస్తుందని తండ్రి భావించాడు. అయితే ఇన్ని రోజులైనా బాలిక తిరిగి రాకపోవడంతో ఆమె స్నేహితులు, బంధువుల ఇళ్లలో విచారించిన ఫలితం లేకపోయింది. తమ గ్రామానికే చెందిన ఒక అబ్బాయితో వెళ్లి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తూ తండ్రి గురువారం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయించండి


ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి వినతి పత్రాన్ని ఇస్తున్న శ్రీనివాస్

చాదర్‌ఘాట్: వాటర్‌వర్క్స్ కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయించాలని తెలంగాణ జలమండలి కాంట్రాక్టర్ అసోసియేషన్ జేఏసీ మీడియా ఇన్‌చార్జ్ పోల్కం శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు.పెండింగ్ బిల్లుల కోసం ఎండీ దానకిషోర్‌కు ఎన్నిసార్లు మనవి చేసినా పట్టించుకోవడంలేదన్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించకపోతే ఎండీ కార్యాలయం ముందు నిరాహారదీక్ష చేపడతామని శ్రీనివాస్ హెచ్చరించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

వనస్థలిపురం: డివిజన్‌లోని ఎఫ్‌సీఐ కాలనీలో గల లక్ష్మీ ఆయుర్వేద ఆసుపత్రిలో ఈ నెల 9న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని ఆసుపత్రి ఎండీ డాక్టర్ యలగందుల శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. శిబిరంలో దీర్ఘవ్యాధులు, కీళ్ల నొప్పులు, పక్షవాతం, కిడ్నీ సమస్యలు, ఎముకల వ్యాధులకు చికిత్సలు నిర్వహిస్తామన్నారు.

పార్కుల్లో పచ్చదనం పెంపునకు చర్యలు


పార్కులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

సైదాబాద్: డివిజన్ పరిధిలోని పార్కుల్లో పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకుంటున్నామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కార్పొరేటర్ హార్టికల్చర్ అధికారులతో కలిసి సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్‌బీహెచ్-ఏ, ఏపీఏయూ కాలనీల్లోని పార్కులను సందర్శించారు. ఆయా పార్కుల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలు, బస్తీలవాసులకు ఆహ్లాదకర వాతావరణం అందేలా పార్కులను ఆధునీకరిస్తున్నామ న్నారు. పార్కులకు వారి కోసం మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అమీన, హార్టికల్చర్ మేనేజర్ యమున, ఫీల్డ్ అసిస్టెంట్ మధు, మల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, విద్యార్థులు

ఎల్‌బీనగర్: నానాటికీ పెరుగుతున్న కాలుష్యం నుంచి పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులు నిర్వహించిన సేవ్ ఎన్విరాన్‌మెంట్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ, పర్యావరణాన్ని కాపాడేందుకు అందరూ ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోను పాల్గొన్నాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.